సాయానికి అడ్డుకట్ట.. రాక్షసత్వానికి పరాకాష్ట

జీవీఎంసీ జోన్-4లో పెన్షన్ల వివరాలు		
వార్డు	లబ్ధిదారులు	నగదు (రూ.)
28	1238	3756000
29	1203	3667000
30	1345	4087000
31	1137	3420500
32	617	1888000
33	1469	4483000
34	1953	5897500
35	1782	5412000
36	1471	4496500
37	1211	3699000
38	1229	3711000
39	1555	4730500

పెన్షన్ కోసం గతంలో పడిన కష్టాలు పగవాడికి కూడా వద్దు అని వృద్ధులు, దివ్యాంగులు నాటి రోజులు గుర్తుకు తెచ్చుకుని వణికిపోయారు. తెల్లవారి వెళ్తే ఏ సాయంత్రానికో అప్పట్లో పింఛన్ అందేదని చెప్పారు. ఒక్కోసారి మర్నాడు రమ్మనే వారని.. తిరగలేక ఓపిక నశించిపోయేదని వాపోయారు. అలాంటి తమకు ఇంటికి పింఛన్ డబ్బు తెచ్చిచ్చేలా జగన్‌బాబు కొత్త పద్ధతి తీసుకు రావడం వల్ల కడుపులో చల్ల కదలకుండా అందుకునే వారమన్నారు. అయితే ఇది చూసి ఓర్వలేని చంద్రబాబు వలంటీర్లను ఇళ్లకు రానీయకుండా చేసి తమ నోటి కాడ కూడు తీసేసాడని ఆవేదనకు లోనయ్యారు. జగన్‌బాబు వస్తేనే తమ బతుకులు బాగుంటాయంటున్నారు.

- పింఛన్లు రాక కన్నీటి పర్యంతమవుతున్న అవ్వాతాతలు
- తమ ఉసురు చంద్రబాబుకు తగులుతుందని శాపనార్థాలు
- నాటి నరకపు రోజులు గుర్తుకు వచ్చి వణికిపోయిన వైనం
- జగన్ వస్తేనే తమకు బతుకు అని స్పష్టీకరణ



పింఛన్‌దారులకు ధైర్యం చెబుతున్న వైఎస్సార్‌సీపీ నేతలు బొడ్డేటి ప్రసాద్, పాల శ్రీహరిరెడ్డి

జగదాంబ/అల్లిపురం/మహారాణిపేట : అయిదేళ్లుగా కూకున్న సోటుకే జగన్‌బాబు పింఛన్ పంపిండు. రోజులు హాయిగా గడిచిపోయాయి. మా బతుకులు బాగుపడిపోనాయని మురిసిపోనాం. అయితే అదును కోసం చూస్తున్న గుంటనక్కలా చంద్రబాబు మా నోటి కాడ కూడు లాగేసాడు. తెల్లారక ముందే మా గడపల కొచ్చి పింఛన్ అందించే వలంటీరులను రానివ్వకుండా సేసి పాపం మూట గట్టుకున్నాడు. ఇక మామెలా బతకాల? మా గోడు ఎవరికి సెప్పాల? అని వృద్ధ పింఛన్‌దారులు ఘొల్లుమంటున్నారు. అయిన వాళ్లకు భారమైపోయిన తమను జగన్‌బాబు కన్నబిడ్డలా ఇన్నేళ్లు సాకాడని.. ఇప్పుడు పింఛన్ అందక తమ పాత రోజులు జ్ఞాపకమొచ్చి ఒళ్లు జలదరిస్తుందని వాపోతున్నారు. కార్యాలయాలకు వెళ్లి పింఛను తెచ్చుకోమంటున్నారని.. అంత దూరం వెళ్లేదెలా అని వాపోతున్నారు. ఎవరికీ మంచి చేయక.. ఎవరినీ సుఖపడనీయని చంద్రబాబుకు తమ ఉసురు తగులుతుందని శాపనార్థాలు పెడుతున్నారు. తాము క్షేమంగా ఉండాలంటే జగన్‌బాబే మళ్లీ సీఎం కావాలని.. ఆయనను గెలిపించుకోకపోతే ఏమవుతుందో చంద్రబాబు ఈ ఒక్క పనితో నిరూపించి చూపించాడని అవ్వాతాతలు వాపోతున్నారు. నియోజకవర్గంలోని జీవీఎంసీ 35వ వార్డులో పింఛనుదారులైన ఏ అవ్వను అడిగినా.. ఏ తాతను అడిగినా ఇలాగే చెబుతున్నారు. మొత్తం నియోజకవర్గంలోని 12 వార్డుల్లో 16,210 మంది లబ్ధిదారులకు వలంటీర్లు పెన్షన్లు అందజేసేవారు. కాగా అవ్వాతాతలకు ఇంటికొచ్చి పింఛన్లు ఇచ్చే వలంటీర్ వ్యవస్థ కొనసాగుతుందని, అది జగనన్న గ్యారంటీ అని 33వ వార్డు సీనియర్ నాయకుడు బొడ్డేటి ప్రసాద్ అన్నారు. వెంకటేశ్వరమెట్టపై పింఛన్లు రాలేదని ఆందోళన వ్యక్తం చేస్తున్న వయోవృద్ధులకు ఆయన ధైర్యం చెప్పారు.

మళ్లీ మాకు తిప్పలు తప్పవు..



ఐదేళ్లుగా 1వ తేదీ తెల్లవారే మాకు వలంటీర్లు పింఛన్ అందజేసేవారు. సొంత మనవడు, మనవరాల్లా ఆప్యాయంగా పలకరించేవారు. మాకు ఇబ్బంది లేకుండా ఐదేళ్లు సేవ చేసిన వలంటీర్లను ఎలక్షన్లు వచ్చాయంటూ ఆపడం దుర్మార్గం. మాలాంటి వృద్ధులను ఇబ్బందులు పెట్టాలనే ఇలా చేస్తున్నారు. మళ్లీ మాకు తిప్పలు తప్పేలా లేవు. -కాండ్రేగుల ఆదిలక్ష్మి, అల్లిపురం

చంద్రబాబు ఈ ఎన్నికల్లో ఓడిపోవాలి..



ఈ చంద్రబాబు అంటేనే నాశనం. చక్కగా ఇంటికి వచ్చి పింఛన్ ఇచ్చే వలంటీర్లేం చేశారు. వారినెందుకు తీసేయాలి? ఎప్పుడో పాత రోజుల్లో వెళ్లినట్లు పింఛన్ కోసం కార్యాలయాలకు వెళ్లాలా? ముసలి వాళ్లం వెళ్లే పరిస్థితిలో ఉన్నామా? మంచి చేయడం అన్నా.. మంచి చేసిన వాళ్లన్నా చంద్రబాబుకు గిట్టదు. చంద్రబాబు ఈ ఎన్నికల్లో ఓడిపోవాలి. - బొడ్డేపల్లి రమణమ్మ, పండావీధి, 35వ వార్డు

మా ఉసురు తగలక మానదు..



నాకు 70 సంవత్సరాలు. సరిగా వినబడదు. వలంటీర్ ప్రతినెల ఇంటికి వచ్చి పింఛన్ ఇచ్చేది. ఇప్పుడు పింఛన్ రాలేదు. పింఛన్ కోసం నేను ఎక్కడికి పరిగెత్తగలను? మాలాంటి ముసలి వాళ్లను ఇలా బాధపెట్టడం భావ్యమా? మా ఉసురు తగలక మానదు. మేలు చేయకపోతే పోయారు. ఇలాంటి పనులా చేస్తారు? మీరు బాగుపడిపోతారనుకున్నారా? మీకూ మాలాంటి గతే పడుతుంది. -నాయిని ఆదమ్మ, ప్రసాద్‌గార్డెన్స్, 35వ వార్డు

మళ్లీ జగన్‌బాబే అధికారంలోకి రావాలి..



చంద్రబాబు అధికారంలోకి వస్తే మళ్లీ మాకు కష్టాలు తప్పవు. జగన్‌బాబు అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి పింఛన్ సక్రమంగా అందించారు. వలంటీర్లు ఇంట్లో మనుషుల కంటే ఎక్కువగా సేవ చేశారు. కానీ ఈనెల ఇంత వరకు పింఛన్ ఇవ్వలేదు. పైగా సచివాలయాలకు వెళ్లి పింఛన్ తీసుకోమంటున్నారు. మా పింఛన్ మాకు ఎప్పటికి అందుతుందో తెలియటం లేదు. - శ్రీకాకుళపు రమణమ్మ, అల్లిపురం

ఎంతో మంది అవస్థ పడుతున్నారు..



అవ్వాతాతలు, దివ్యాంగులకు పెన్షన్ రాకపోవడానికి చంద్రబాబు అడ్డంకిగా నిలిచారు. దీని కోసం నిమ్మగడ్డను పావుగా వాడుకున్నారు. నిమ్మగడ్డ, టీడీపీ కలిసి పెన్షన్‌దారులపై కుట్ర పన్నడం దారుణం. వలంటీర్లపై బాబుకు ఎందుకంత కక్ష అన్నది తెలియదు. చంద్రబాబు చర్యలు, ఈసీ నిర్ణయంతో ఇంటికి వచ్చే పెన్షన్ ఆగిపోయింది. దీనివల్ల ఎంతో మంది అవస్థలు పడుతున్నారు. - సారిక దివ్యాకుమార్, ఆశిపాపవీధి, 37వ వార్డు

చంద్రబాబే కారణం..



వలంటీర్లు పెన్షన్లు పంపిణీ చేయడంపై ఈసీ ఆంక్షలు విధించడానికి చంద్రబాబే కారణం. అవ్వాతాతలు, దివ్యాంగులపై చంద్రబాబు కసి తీర్చుకున్నారు. సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ సంస్థ ముసుగులో నిమ్మగడ్డతో కలిసి పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని అడ్డుకున్నారు. ప్రజలకు మేలు చేసేది ఏదీ చంద్రబాబుకి ఇష్టం ఉండదు. అతను చేయడు, చేస్తున్న వారిని చేయనివ్వడు. దీని వల్ల నాలాంటి దివ్యాంగులు ఇబ్బందులు పడతారు. - గరికిన చంద్రశేఖర్ (దివ్యాంగుడు), జబ్బరితోట, రెల్లివీధి

వలంటీర్ వ్యవస్థపై కుటిల రాజకీయాలు

ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి గణేష్‌కుమార్



మాట్లాడుతున్న వాసుపల్లి గణేష్‌కుమార్

అల్లిపురం: సీఎం జగన్‌ను ఎదుర్కోలేక చంద్రబాబు అవ్వాతాతలకు పెన్షన్ ఇచ్చే వలంటీర్ వ్యవస్థపై కుటిల రాజకీయాలు చేసి అడ్డుపడుతున్నారని వాసుపల్లి గణేష్‌కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బాబుకు అవ్వాతాతల ఉసురు తగలక తప్పదన్నారు. మంగళవారం తన క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర గ్రంథాలయ చైర్మన్ కొండా రాజీవ్‌తో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా 2 లక్షల 50 వేల మంది వలంటీర్లను నియమించారన్నారు. సూర్యుడు ఉదయించక ముందే లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్లు అందిస్తున్న ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. చేతకాని దద్దమ్మలు అవ్వాతాతలకిచ్చే పింఛన్లకు కూడా ఎలక్షన్ రూల్ వర్తించేలా నిమ్మగడ్డ రమేష్‌తో ఫిర్యాదు చేసి అడ్డుకట్ట వేశారన్నారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్ అవ్వాతాతల నోటి కాడ కూడు లాక్కున్నారని మండిపడ్డారు. ఇందుకు వారు తగిన మూల్యం చెల్లించక తప్పదన్నారు. కొండా రాజీవ్ గాంధీ మాట్లాడుతూ మే 13న జరిగే ఎన్నికల్లో అవ్వాతాతలు కొట్టే దెబ్బకు కూటమి తుడిచిపెట్టుకు పోవడం ఖాయమని జోస్యం చెప్పారు. ఈ సమావేశంలో కార్పొరేటర్ కోడూరు అప్పలరత్నం, మేరీజోన్స్, చెన్నా జానకిరామ్, జేసీఎస్ మండల అధ్యక్షుడు రామానంద్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఒంటి పూట బడులపై దృష్టి సారించాలి

ఎంవీపీ కాలనీ: పెరుగుతున్న వేసవి ఉష్ణోగ్రతల నేపథ్యంలో ఒంటిపూట బడుల నిర్వహణపై రాష్ట్ర విద్యాశాఖ అధికారులు ప్రత్యేక దృష్టిసారించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం సూచించారు. మంగళవారం ఎంవీపీ కాలనీలో జరిగిన ఓ సమావేశంలో ఆయన మాట్లాడారు. విశాఖ జిల్లాతో పాటు రాష్ట్రంలోని 25 జిల్లాల అధికారులు ఈ మేరకు చర్యలు చేపట్టాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ నిబంధనలు, కమిషన్ ఆదేశాలకు అనుగుణంగా ఒంటిపూట బడులు సమర్థవంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇందుకు అనుగుణంగా కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు ఇప్పటికే అన్ని జిల్లాల కలెక్టర్లు, విద్యాశాఖ అధికారులకు ఉత్తర్వులు జారీ చేసినట్లు వెల్లడించారు.

వైఎస్సార్‌సీపీ నాయకుల ఇంటింటి ప్రచారం



ప్రసాద్‌గార్డెన్స్‌లో ప్రచారం చేస్తున్న అలపన కనకరెడ్డి తదితరులు

జగదాంబ: జీవీఎంసీ 35వ వార్డులో వార్డు ఇన్‌చార్జి అలపన కనకరెడ్డి ఆధ్వర్యంలో ప్రచారం ముమ్మరంగా సాగుతోంది. వార్డు నాయకులతో కలిసి కల్లుపాకలు, గాజులవీధి, బొడారా రోడ్డు, నూనెమిల్లు వీధి, పూర్ణా మార్కెట్, స్ప్రింగ్ రోడ్డు ప్రాంతాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. పార్లమెంట్ అభ్యర్థి బొత్స ఝాన్సీలక్ష్మి, ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి గణేష్‌కుమార్‌ను గెలిపించుకోవాలని కోరుతూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కనకరెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు కుటిల రాజకీయం వల్ల పింఛన్‌దారులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. అటువంటి నాయకులను జనం మధ్య తిరగకుండా ఓటు ద్వారా బుద్ధి చెప్పాలన్నారు. సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్రాన్ని పాలిస్తున్న జగనన్ననే మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు నాయకులు ఆదివిష్ణురెడ్డి, సుబ్రహ్మణ్యం, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు చెప్పండి.. అన్నీ పరిష్కరిస్తాం..

- సమస్యల రహిత హాస్టళ్లే లక్ష్యం
- ఏయూ అధికారుల హామీ
- హర్షం వ్యక్తం చేసిన విద్యార్థినులు



విద్యార్థినులతో మాట్లాడుతున్న ఏయూ ఇంజినీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ శశి భూషణరావు

విశాఖ సిటీ: ఏయూ హాస్టళ్లను సమస్యల రహితంగా తీర్చిదిద్దుతామని ఏయూ ఇంజినీరింగ్ కాలేజ్ ప్రిన్సిపాల్ శశి భూషణరావు విద్యార్థినులకు హామీ ఇచ్చారు. తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం వర్సిటీ పరిపాలన భవనానికి ప్రిన్సిపాల్ శశిభూషణ్‌రావుకు ఇంజినీరింగ్ కళాశాల హాస్టల్ విద్యార్థినులు విన్నవించుకున్నారు. దీనికి స్పందించిన ప్రిన్సిపాల్.. 'మీ సమస్యలు చెప్పండి.. దానికి ఏం చేయాలో కూడా చెప్పండి.. తప్పకుండా అన్నీ పరిష్కరిస్తాం..'అంటూ హామీ ఇచ్చారు. దీంతో విద్యార్థినులు హర్షం వ్యక్తం చేశారు. ఏయూలో విద్యార్థులకు మెరుగైన వసతుల కల్పనకే ప్రథమ ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. ఎటువంటి సమస్య ఉన్నా తమకు తెలియజేయాలని సూచించారు. ఇప్పటికే ప్రతి హాస్టల్‌ని పూర్తి స్థాయిలో ఆధునికీకరించామని, టాయిలెట్స్ మార్పు చేశామన్నారు. ఓఎస్‌డీ ఆచార్య వి.కృష్ణమోహన్ మాట్లాడుతూ విద్యార్థులు తమ సమస్యను హాస్టల్ వార్డెన్ దృష్టికి తీసుకువెళ్లాలని, అక్కడ పరిష్కారం కాని పక్షంలో ప్రిన్సిపాల్ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ప్రోద్బలంతోనో ఇటువంటి నిరసనలు చేపట్టవద్దన్నారు. మిమ్మల్ని ఎవరైనా వెనకుండి చెయ్యమన్నారా? అని ప్రశ్నించగా, ఓ మీడియా సంస్థ పేరు చెప్పడం ఓఎస్‌డీ ఆశ్చర్యం వ్యక్తం చేశారు.

అధికారుల సత్వర స్పందన

వర్సిటీ ఇంజినీర్ ఆర్.శంకరరావు వెంటనే విద్యార్థినుల హాస్టళ్లను ఆచార్యులతో కలిసి పరిశీలించారు. హాస్టళ్లలో టాయిలెట్స్ నిర్వహణ, అవసరమైన మరమ్మతులు చేపట్టాల్సిన పనులను గుర్తించారు.

దక్షిణలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగరేస్తాం

- ఉత్సాహపూరిత వాతావరణంలో వాసుపల్లి ఎన్నికల ప్రచారం
- ముస్లిం పెద్దలు, మహిళలను కలిసి ఓటు అభ్యర్థన
- మత్స్యకార మహిళలతో నృత్యం



ముస్లిం పెద్దను అక్కున చేర్చుకున్న వాసుపల్లి



వృద్ధురాలితో మాట్లాడుతూ..



మా ఎమ్మెల్యే మీరే అంటూ వాసుపల్లితో కరచాలనం చేస్తున్న మహిళ



వాసుపల్లి ప్రచారంలో పాల్గొన్న మహిళలు



ప్రచారం చేస్తున్న బొత్స ఝాన్సీ, వాసుపల్లి తదితరులు

జగదాంబ: దక్షిణలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగరేస్తామని ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి గణేష్‌కుమార్ అన్నారు. జీవీఎంసీ 39వ వార్డు పార్టీ ఇన్‌చార్జి కొల్లి సింహాచలం ఆధ్వర్యంలో వాసుపల్లి గణేష్‌కుమార్, నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు ద్రోణంరాజు శ్రీవత్సవ్ లక్ష్మీ టాకీస్, చిలకపేట, పాతచిలకపేట, మౌలాలీ పంజా, కోటవీధి, రామకృష్ణా వీధి, వన్‌టౌన్ ప్రధాన రహదారి ప్రాంతాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. నాయకులకు మహిళలు బ్రహ్మరథం పట్టారు. అడుగడుగునా హారతులు, పూలదండలు, సన్మానాలు, ఆత్మీయ పలకరింపులతో నీరాజనం పట్టారు. పాతచిలక వీధిలో మత్స్యకార మహిళలతో కలిసి వాసుపల్లి డ్యాన్సు చేశారు. అవ్వాతాతలు, మహిళలను ఓటు అభ్యర్థించారు. ఎంపీగా బొత్సఝాన్సీ, ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని కోరారు. అనంతరం ఎన్నికల పరిశీలకులు ద్రోణంరాజు శ్రీవత్సవ్ మాట్లాడుతూ గెలుపు గుర్రం వాసుపల్లి అన్నారు. ఇంతటి ప్రజాదరణ వాసుపల్లికే ఉందన్నారు. ఎమ్మెల్యేగా వాసుపల్లి గెలుపు నల్లేరుపై నడకలా మారిపోయిందని శ్రీవత్సవ్ అన్నారు.

ఈమట్టిలో నుంచే వచ్చాను..

ఈ మట్టిలో నుంచే వచ్చానని, దక్షిణలో ప్రజలు రెండు సార్లు తనకు పట్టం కట్టారని వాసుపల్లి గణేష్‌కుమార్ అన్నారు. తనను మళ్లీ గెలిపించాలని ప్రజలను కోరారు. జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరి ఇంటికి వచ్చే విధంగా కృషి చేస్తానన్నారు. మత్స్యకారులు, ముస్లింలు అధికంగా ఉన్న ప్రాంతం 39వ వార్డు అన్నారు. ఇక్కడి ప్రజలు చూపిస్తున్న ఆప్యాయత ఎప్పటికీ గుర్తుండిపోతుందన్నారు. చిలకపేట మురుగు కాలువ సమస్య, వ్యాయామశాల నిర్మాణం, కల్యాణ మండపం అభివృద్ధి చేస్తానన్నారు. అభివృద్ధి, సంక్షేమం ఇలాగే కొనసాగాలంటే జగన్‌మోహన్‌రెడ్డినే మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాలన్నారు. దక్షిణలో ఎంతో పేరు ప్రఖ్యాతులు ఉన్న దివంగత నేత ద్రోణంరాజు శ్రీనివాసరావు తనయుడు శ్రీవత్సవ్‌ను ఎన్నికల పరిశీలకునిగా పంపిన జగనన్నకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు సనపల రవీంద్ర భరత్, మైనార్టీ సెల్ నాయకురాలు షబీరా బేగం, ముజీబ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీతోనే ముస్లింలకు న్యాయం..

అల్లిపురం: ముస్లింలకు నాలుగు శాతం రిజర్వేషన్ అందించిన ఘనత దివంగత నేత డాక్టర్ వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డికే దక్కుతుందని విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ తెలిపారు. రంజాన్ మాసం సందర్భంగా మంగళవారం సాయంత్రం 36వ వార్డు సున్నపువీధి మసీదులో జరిగిన ఇఫ్తార్ విందులో వాసుపల్లి గణేష్‌కుమార్, కోలా గురువులు, ద్రోణంరాజు శ్రీవత్సవ్‌లతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ మళ్లీ అధికారంలోకి రావాలంటే తనతో పాటు వాసుపల్లి గణేష్‌కుమార్‌కు ఓటేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. దక్షిణంలో మసీదు నిర్మాణాలకు స్థల కేటాయింపులో న్యాయం చేశామన్నారు. జగనన్న ప్రభుత్వంలో ఏ సమస్యకైనా పరిష్కారం లభిస్తుందన్నారు. ముస్లిం సోదరులందరికీ అండగా ఉంటామని అల్లా సాక్షిగా హామీ ఇస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మేరీ జోన్స్, డాక్టర్ జహీర్ అహ్మద్, నియోజకవర్గ మైనార్టీ అధ్యక్షుడు ముజీబ్‌ఖాన్, సబీరా బేగం, కో ఆప్షన్ మెంబర్ షరీఫ్, షకీర్ తదితరులు పాల్గొన్నారు.

ముస్లింలకు నిత్యావసర సరకుల పంపిణీ



ముస్లింలకు నిత్యావసర సరకులు పంపిణీ చేస్తున్న మార్కండేయులు, తదితరులు

ఎంవీపీ కాలనీ: రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి దేవరకొండ మార్కండేయులు(మహ్మద్ ఇబ్రహీం) ఆధ్వర్యంలో రంజాన్ తోఫా పేరిట నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. మంగళవారం ఉదయం 17వ వార్డులో ఈ జరిగిన ఈ కార్యక్రమంలో వివిధ ప్రాంతాలకు చెందిన ముస్లిం మహిళలు పాల్గొని బియ్యం బ్యాగులతో పాటు పలు నిత్యావసర సరకులు స్వీకరించారు. ఈ సందర్భంగా మార్కండేయులు మాట్లాడుతూ ముస్లిలకు రంజాన్ మాసం ఎంతో పవిత్రమైందన్నారు. రాష్ట్రంలోని ముస్లింలకు సముచిత స్థానం కల్పించిన ప్రభుత్వంగా వైఎస్సార్‌సీపీ సర్కారు నిలిచిందన్నారు. సంక్షేమ పథకాలతో పాటు రాజకీయ ప్రాధాన్యం కల్పించి ముస్లింలకు అండగా నిలిచిందన్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా ముస్లింలు పని చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ముస్లిం ఫెడరేషన్ ప్రతినిధి కడిత రమణమ్మ పాల్గొన్నారు.

ఉక్కు పరిరక్షణ పోరాటానికి మూడేళ్లు

సీతంపేట: విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను అమ్మేయాలని చూస్తున్న ప్రధాని మోదీ, బీజేపీకి సహకరిస్తున్న టీడీపీ, జనసేన పార్టీలకు తగిన బుద్ధి చెప్పాలని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ జేఏసీ నాయకులు కార్మిక వర్గానికి, విశాఖ ప్రజలకు పిలుపునిచ్చారు. పోరాట కమిటీ ఆధ్వర్యంలో జీవీఎంసీ విగ్రహం వద్ద జరుగుతున్న దీక్షా శిబిరం ఏప్రిల్ 2 నాటికి మూడేళ్లు పూర్తి అయిన సందర్భంగా పోరాట కమిటీ భారీ నిరసన కార్యక్రమం చేపట్టింది. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.కె.ఎస్.వి.కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి, జేఏసీ చైర్మన్ మరడాన జగ్గునాయుడు, జేఏసీ చైర్మన్ మంత్రి రాజశేఖర్, స్టీల్ గుర్తింపు యూనియన్ నాయకులు ఆదినారాయణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలు పెద్ద ఎత్తున నిరసన చేపట్టినా మోదీ ప్రభుత్వం దిగిరాకపోవడంతో ఏప్రిల్ 2న జీవీఎంసీ వద్ద దీక్షా శిబిరం ప్రారంభించామన్నారు. మూడేళ్లుగా శిబిరాన్ని విజయవంతంగా నడిపిస్తున్న కార్మిక, విద్యార్థి, యువజన, ప్రజా, మహిళా సంఘాల నాయకులను అభినందించారు. స్టీల్ ప్లాంట్ పరిరక్షణకు నిలబడే పార్టీలను రానున్న ఎన్నికల్లో గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు నాగభూషణం, మన్మథరావు, పడాల రమణ, వామనమూర్తి, పి. మణి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన



అష్టదళ పద్మారాధనలో సిరులతల్లి

డాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనక మహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో పి. శ్రీనివాసులరెడ్డి, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

6న సహస్ర తులసిపూజ

కనకమహాలక్ష్మి దేవస్థానంలో ఈనెల 6న సహస్ర తులసిపూజ నిర్వహించనున్నామని ఈవో శ్రీనివాసులరెడ్డి తెలిపారు. ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు పూజా రుసుం రూ.1500 చెల్లించి దంపతులు ఈ పూజలో పాల్గొనవచ్చని ఈవో పేర్కొన్నారు.

మహిళలకు చీరల పంపిణీ



మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న జహీర్ అహ్మద్

జగదాంబ: పవిత్ర రంజాన్ సందర్భంగా స్వామి వివేకానంద సంస్థలో మహిళలకు సంస్థ చైర్మన్ డాక్టర్ జహీర్ అహ్మద్, రౌండ్ టేబుల్ చైర్మన్ మక్సూద్ అహ్మద్ చీరలు పంపిణీ చేశారు. మంగళవారం జీవీఎంసీ 39వ వార్డులో జరిగిన ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ సంస్థలో ప్రతి సంవత్సరం రంజాన్‌కు మహిళలకు చీరలు పంపిణీ చేయడం ఆనవాయితీ అన్నారు. పేద మహిళలకు సేవ చేయడం ఆనందం అన్నారు. సంస్థ సేవా కార్యక్రమాల్లో పాలుపంచుకుంటున్న సభ్యులకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పైడిమాంబ మారువారం పండగ



ఆరిలోవ: జీవీఎంసీ పదో వార్డు డెయిరీ ఫారం జంక్షన్‌లో కొలువుదీరిన పైడిమాంబ అమ్మవారి మారువారం పండగ మంగళవారం ఘనంగా జరిగింది. గత నెల 18 నుంచి 26 వరకు అమ్మవారి నవరాత్రి జాతర మహోత్సవాలు జరిగిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా మారువారం పండగ సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు మధ్యాహ్నం భారీ అన్నసమారాధన చేపట్టారు. రవీంద్రనగర్, ఆదర్శనగర్, వివేకానందనగర్, సుందర్‌నగర్, డెయిరీ ఫారం, ఇందిరానగర్, తదితర ప్రాంతాల నుంచి సుమారు 3వేల మందికి పైగా భక్తులు తరలివచ్చి అమ్మవారి ప్రసాదం స్వీకరించారని ఆలయ కమిటీ అధ్యక్షుడు మీసాల రామలక్ష్మణ్ తెలిపారు. పండగ ప్రశాంతంగా జరగడానికి సహకరించిన వివిధ గ్రామ సంఘాల నాయకులు, యువత, పోలీసులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

దువ్వాడ రైల్వే స్టేషన్‌లో గంజాయి స్వాధీనం

అగనంపూడి: దువ్వాడ రైల్వే స్టేషన్‌లో మంగళవారం 14 కేజీల 3.10 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఆర్‌పీఎఫ్‌పీపీ ఎస్ఐ కె.శాంతారాం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. విశాఖ జీఆర్‌పీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్.ధనుంజయ నాయుడు ఆధ్వర్యంలో దువ్వాడ రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫారంపై తనిఖీలు నిర్వహిస్తుండగా గుర్తు తెలియని వ్యక్తి బ్యాగులో రూ.71,050 విలువ గల 14 కేజీల 3.10 గ్రాముల గంజాయిని గుర్తించారు. బ్యాగును సీజ్ చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు శాంతారాం తెలిపారు.